క్లుప్తంగా

శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానానికి రూ.4 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు, సుధీర్‌కుమార్

ఒంగోలు: కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్పస్వామి ఆలయానికి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, వారి తనయుడు శిద్దా సుధీర్‌కుమార్ రూ.4 లక్షల విరాళం అందించారు. శుక్రవారం ఆలయ ఈవోకు ఆ మొత్తాన్ని అందించారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ చేయూత


విద్యార్థికి ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్ట్ సెక్రటరీ, తదితరులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థి సునన్నకి సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ శుక్రవారం ఆర్థిక చేయూతనిచ్చింది. కబాడీపాలేనికి చెందిన విద్యార్థి సునన్న తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఫీజు, ఇతర అవసరాల నిమిత్తం రూ.20 వేలను ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్ అందించారు. ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ బాషా దాతల సహకారంతో విద్యార్థులకు, అనాథలకు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నారని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ఈ సందర్భంగా కొనియాడారు. చిక్కాల కిరణ్ కుమార్, దివ్యాంగులు పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు

● ఎస్పీ దామోదర్


ట్రాఫిక్ పోలీసు స్టేషన్లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: నగరంలో ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సైలెన్సర్ల సౌండ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టౌన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. తగినన్ని బారికేడ్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. నగరంలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. తొలుత పోలీసు స్టేషన్లోని రికార్డులు పరిశీలించి సిబ్బంది వివరాలడిగి తెలుసుకున్నారు. విధులపట్ల అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. ఎస్పీ వెంట ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య, ఎస్బీ సీఐ రాఘవేంద్ర ఉన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కల్పన

ఒంగోలు: స్థానిక క్విస్ ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్త్రీ జననేంద్రియ సమస్యలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ గైనకాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ గుంజుపల్లి కల్పన పాల్గొని అవగాహన కల్పించారు. కాలేజీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ జననేంద్రియాలకు సంబంధించి రుగ్మతలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం వైద్యురాలు కల్పన మాట్లాడుతూ జననేంద్రియాలకు సంబంధించిన క్యాన్సర్, క్యాన్సర్‌కు ముందు పరిస్థితులు, స్త్రీల మూత్ర వ్యవస్థకు సంబంధించిన సమస్యలు, రుతుచక్రం ఆగిపోయిన స్థితి, రుతు స్రావంలో నొప్పి, సంతానలేమి, అధిక రుతుస్రావం, గర్భసంచి జారడం వంటి అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ జననేంద్రియాలకు సంబంధించి రకరకాలైన ఇన్ఫెక్షన్ల గురించి వివరించి వాటి బారినుంచి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. పీరియడ్స్ గురించి ప్రతి మహిళ, అమ్మాయి ఎంత మాట్లాడితే అంత మంచిదని, కానీ దురదృష్టవశాత్తూ ఈ విషయం గురించి మన దగ్గర మెన్సుస్ట్రువల్ ప్రారంభమయ్యేవరకు తెలియదని కొన్ని గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ విషయం గురించి కనీస అవగాహన ప్రతి యువతికి తప్పనిసరని అన్నారు. ప్రతిఒక్కరూ తమ ఆడపిల్లలకు ఈ విషయం గురించి చెప్పాలని, తద్వారా మనం అనేక సమస్యల నుంచి కాపాడుకోవడం సాధ్యపడుతుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, కిమ్స్ మేనేజర్ అమర్‌నాథ్, క్విస్ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ధనమూర్తి పాల్గొన్నారు.

మండలంలో ఆధార్ క్యాంపులు

మద్దిపాడు: మండలంలో ఈ నెల 23వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. 23వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యాంపు జరుగుతుందని, ఏడుగుండ్లపాడు, దొడ్డవరప్పాడు గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొని వారి గ్రామాల్లోని వారిని క్యాంపునకు పంపాలని తెలిపారు. అదేవిధంగా 24వ తేదీ ఇనమనమెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహిస్తారని, బసవన్నపాలెం ఇనమమెళ్లూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 25వ తేదీ గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుండ్లాపల్లి అన్నంగి గ్రామాలకు, 26వ తేదీ పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెదకొత్తపల్లి, నేలటూరు గ్రామాల ప్రజలకు, 27వ తేదీ తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దొడ్డవరం, మల్లవరం గ్రామాల వారికి ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయడంతో పాటు చిన్నపిల్లలకు ఆధార్ నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బంది, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓ, ఏఎస్ఎం, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ల అభ్యర్థుల అప్లికేషన్‌లు పూర్తి చేసి వారిని క్యాంపునకు తరలించడం, వారిని క్షేమంగా తిరిగి ఇళ్లకు చేర్చడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆ మేరకు క్యాంపులు జరిగే గ్రామాలలో టాంటాం వేయించాలని గ్రామ కార్యదర్శులకు ఎంపీడీఓ ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన ప్రజలంతా క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.


అగ్ని ప్రణయం నిర్వహిస్తున్న వేద పురోహితులు

కోదండ రామునికి పవిత్రోత్సవాలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు గుర్రంవారివీధిలో గల శ్రీ కోదండ రామాలయంలో పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీమాన్ పరాశర లక్ష్మీనరసింహ భట్టర్ స్వామి (శ్రీరంగం) ఆధ్వర్యంలో త్రయాత్నాకంగా జరిపిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఆలయ ప్రాంగణంలో విష్వక్సేన పూజ, పుణ్యాహం, అగ్నిప్రణయనం, కుంభా రాధన, ఉక్త హోమాలు, శాంతి హోమం, మహా పూర్ణాహుతి, కుంభ సమారోపణం, విశేషార్చన, చతుర్వేద పారాయణం, శాత్తుమురై, తీర్థ ప్రసాద గోష్ఠి లాంటి పూజా క్రతువులను వేదోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విష్వక్సేన పూజలో పాల్గొన్న భక్తులు

శ్రీగిరి గిరి ప్రదక్షిణకు ఎస్పీకి ఆహ్వానం



శ్రీగిరి గిరి ప్రదక్షిణకు ఎస్పీని ఆహ్వానిస్తున్న గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు

ఒంగోలు మెట్రో: జిల్లా ఎస్పీ దామోదర్‌ను శుక్రవారం శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యులు కలిశారు. గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణ గుప్తా జంధ్యం నేతృత్వంలో సహ కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, సభ్యులు నల్లమల్లి కోటి సూర్య నారాయణ, ధనిశెట్టి రామునాయుడు, నల్లమల్లి శ్రీపద్మలత, కోలా వాసుదేవ్ తదితరులు కలిశారు. 2023 ఆగస్ట్ 29న నగరంలో శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమం గురించి వివరించారు. ఈ నెల 22 జరిగే శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి ఎస్పీని ఆహ్వానించారు. అనంతరం దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఎస్పీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆషా సేవలు అభినందనీయం


పశువైద్యాధికారిని సత్కరిస్తున్న అధికారులు, రైతులు

కొత్తపట్నం: పశువైద్యాధికారి ఉప్పుటూరి ఆషా పాడి రైతుల పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించి గ్రామస్తులు అభినందనలు పొందారని ఏవీహెచ్ ఎన్జీపాడు ఏడీ నాగభూషణం అన్నారు. ఆషా బదిలీ సందర్భంగా కొత్తపట్నం పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఏవీహెచ్ త్రోవగుంట ఏడీ బసవశంకర్ అధ్యక్షత వహించగా, నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఆరు సంవత్సరాలుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ విధులు నిర్వహిస్తూ ఎలాంటి గ్రీవెన్స్ అర్జీలు కూడా లేకుండా రైతులు, గ్రామస్తులలో మంచి పేరు ప్రఖ్యాతులను ఆషా తెచ్చుకున్నారని కొనియాడారు. గతంలో పశువైద్యాధికారి హాస్పిటల్‌కే మాత్రమే పరిమితమయ్యేవారని, నేడు నిత్యం రైతులు, గ్రామస్తులతో మమేకమై విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. 2004 నుంచి పశువైద్యాధికారుల విధుల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, నిత్యం రైతులు, ప్రజలతో కలిసి పని చేస్తున్నారని తెలిపారు. ఆషా మాట్లాడుతూ ఇక్కడి రైతులకు తన సేవలు ఎంతో ఉపయోగపడటం తనకు ఎంతో ఆనందం కలిగించిందన్నారు. పశువులకు ఏదైనా ఇబ్బంది వస్తే తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. జిల్లా అధికారుల సహాయ సహకారాలతో తనకు మంచి పేరు వచ్చిందని తెలిపారు. ఆషాను రైతులు, గ్రామస్తులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొత్తపట్నం ఇన్‌చార్జి వైద్యాధికారి తుపాకుల అనూషా, అల్లూరు వైద్యాధికారిని శోభ, టంగుటూరు, ఉలిచి, ఎం.నిడమానూరు, ఉప్పుగుండూరు, నిప్పట్లపాడు, కొణిజేడు, యరజర్ల-1 వైద్యాధికారులు విజయ, మాధవి, ప్రతిమ, ధనలక్ష్మి, జాస్మిన్, ప్రశాంతి, అనిల్, భూపాల్, ఎందేటి వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొత్తపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. సమావేశానికి రాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తక పఠనం పెంచాలి

యర్రగొండపాలెం: సెల్‌ఫోన్‌ను తలవంచుకుని చూస్తే సమాజంలో కూడా తలవంచుకోవాల్సిందేనని, కానీ, తలవంచి పుస్తక పఠనం చేస్తే సమాజంలో తలెత్తుకునే విధంగా ఎదుగుతారని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథ్ రచించిన కవితా మంజూష గ్రంథ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని, నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. రచయిత విశ్వనాథ్ మాట్లాడుతూ కవులు ముందు యుగపు దూతలని, వారు గతం, భవిష్యత్తుకు వారధులని, వారిని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులు గొప్ప జ్ఞాన సంపన్నులని, ఉన్నత విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి వెంకటస్వామి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన, పాఠశాల మెరిట్ విద్యార్థులకు రచయిత, ఆవిష్కరణ కర్తలు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున అందించి ప్రోత్సహించారు. అనంతరం వారిని ఎంఈవో, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లునాయక్, హెచ్ఎం కె.రమాదేవి, ఉపాధ్యాయులు రజని, ఖయ్యూంబాష, మంత్రూనాయక్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన హోటల్స్ ప్రతినిధులు



ఎస్పీని కలిసిని హోటల్ యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా హోటల్స్ యజమానుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లలో ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గంజాయి ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ఇబ్బందులు కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఎస్పీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు వై.కొండయ్య నాయుడు, కె.నాగేశ్వరరావు, బి.మహేష్, వర్మరంగారావు, ద్వారకా నారాయణ, మస్తాన్ తదితరులు ఉన్నారు.


వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించండి


స్థానికుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ సురేష్

చీమకుర్తి: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్ఓ డీ సురేష్ వైద్యసిబ్బందికి, స్థానిక ప్రజలకు సూచించారు. శుక్రవారం స్థానిక వైద్యసిబ్బందితో కలిసి సంతనూతలపాడులోని అంబేడ్కర్ నగర్‌లో డెంగీ జ్వరం వచ్చిన వ్యక్తి ఇంటి పరిసరాలను డీఎంహెచ్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ దోమతెరలు వాడాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో జ్వరాలు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా బ్లీచింగ్, ఎబేట్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి, స్థానిక వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

డేంజర్ ఫుడ్..!

- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్ల ప్యాకెట్లతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్న ప్యాకెట్ ఫుడ్
- చిన్నారులే లక్ష్యంగా రకరకాల స్నాక్స్ ప్యాకెట్లు
- వై.పాలెం నియోజకవర్గంలో సుమారు వెయ్యి దుకాణాల్లో విక్రయాలు
- లక్షల రూపాయల్లో వ్యాపారం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు


ఓ దుకాణంలో భారీగా వేలాడదీసిన చిరుతిండ్ల ప్యాకెట్లు

పుల్లలచెరువు:

చిరుతిండ్లతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై అనారోగ్యం బారిన పడుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, వై.పాలెం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో దాదాపు వెయ్యి దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. వ్యాపారస్తులు చేసే జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునే కార్టూన్ రంగుల ప్యాకింగుల్లో చిరుతిండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వలన భవిష్యత్ పెనుముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా మార్కెట్లోకి కల్తీ ఆహార పదార్థాలు...

ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి జిల్లాలో ప్రతిరోజూ లక్షల రూపాయల్లో వ్యాపారం జరుగుతోందనేది నగ్నసత్యం. వీటిపై కనీస తనిఖీ లేకపోవడంతో ఎవరిష్టం వారిది అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

నాసిరకం చిరుతిండ్లు తింటే రోగాలొస్తాయి

నాసిరకం చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ చిరుతిండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు కూడా వినియోగిస్తున్నారు. వీటిని తినడం వలన భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు.

– డాక్టర్ లక్ష్మీనరసింహం, ప్రభుత్వా స్పత్రి వైద్యుడు, పుల్లలచెరువు

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



ప్రమాదకరమైన జంక్ ఫుడ్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. రెడీమేడ్ తినుబండారాలు, చిరుతిండ్లను పిల్లలకు పెట్టడం వలన భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రుచి కోసం, నిల్వ కోసం వాటిలో ప్రమాదకరమైన కెమికల్స్ వాడతారు. వీటిని తినడం వలన పిల్లలకు దురద, గుల్లలు వస్తాయి. జీర్ణకోశ సమస్య, కడుపు నొప్పి లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

– ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు, జెడ్పీ పాఠశాల, పుల్లలచెరువు

చిరుతిండ్లకు దూరంగా ఉండాలి



నాణ్యత లేని చిరుతిండ్లు చిన్నారులే కాదు.. పెద్దలు కూడా తినకూడదు. పిల్లలు మారం చేయడం వలన తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా వాటిని కొని పిల్లలకు ఇస్తున్నారు. అలా చేయడం వలన చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనిపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సి ఉంది. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి.

– బి.ఓబులు, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్

పాఠశాలల్లో నివారించి అవగాహన కల్పించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు ముందుగా ఇళ్లలో, ఆ తర్వాత పాఠశాలల్లో నివారించాలి. సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమెడ్ వాటి జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి, పుల్లలచెరువు

ఘనజీవామృతంలో మెళకువలు పాటించాలి


ఘనజీవామృతం తయారు చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

మదనూరు (కొత్తపట్నం): ఘనజీవామృతం తయారీలో రైతులు మెళకువలు పాటించాలని మాస్టర్ ట్రైనర్ నరసింహులు సూచించారు. మదనూరు యూనిట్ పరిధిలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన జీవామృతంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి చామ, అరటి పంటలను సందర్శించి ఆ పంటలకు కావాల్సిన ఘన జీవామృతాన్ని 2 వేల కేజీల దేశీయ ఆవు పేడతో తయారు చేశారు. తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. తయారు చేసిన ఘనజీవామృతాన్ని ఒక ఎకరానికి 400 కేజీలను భూమిలో వేసుకుంటే రసాయన ఎరువులు వాడనవసరం లేకుండా పండించుకోవచ్చన్నారు. మనమే తయారు చేసుకుని ఘనజీవామృతాన్ని వాడుకుంటే పంటలకు కావాల్సిన అన్ని పోషకాలు అందడంతో పాటు భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందన్నారు. మొక్కకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. రైతులంతా ఘన జీవామృతాన్ని విరివిగా తయారు చేసుకుని అన్ని రకాల పంటలకు ఉపయోగించుకోవాలని సూచించారు. తద్వార దిగుబడులు కూడా ఎక్కువగా వస్తాయన్నారు. అనంతరం సోపిరాల మనోహర్ పొలంలో వేరుశనగ పంటకు బీజామృతం విత్తనశుద్ధి చేశారు. పైరుకు గట్ల మధ్యలో అంతర్ పంటలైన బెండ, గోరు చిక్కుడు, పొద్దు తిరుగుడు, ఆముదం, జొన్న, మొక్కజొన్నలను వేయడం వలన చీడపీడలు ఆశించకుండా పంటలు పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ పిట్టు వెంకటేశ్వరరెడ్డి, ఐసీఆర్‌పీలు రెహమాన్ బాషా, మనోహర్, కాసింబీ, రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
Office mail : sakshiongads@gmail.com